ప్రజాశక్తి

శనివారం 30 ఆగస్టు 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రైతులకు అతివృష్టి నష్టం

పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో నీట మునిగిన పొలాలు (ఫైల్)

- రెండు నెలలుగా కొనసాగుతున్న భారీ వర్షాలు
- తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదు
- దెబ్బతింటున్న పైర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అవసరానికి మించి వానలతో పొలాల్లో నీరు బయటకు వెళ్లక రైతులు అల్లాడుతున్నారు. పైర్లు నీట మునిగి నష్టపోతున్నారు. అయితే ఈ దశలో నష్టపరిహారం వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఈనెల 13,14 తేదీల్లో అతి భారీ వర్షాలతో దెబ్బతిన్న పైర్లకు అంచనాలు రూపొందించేలోగానే మళ్లీ 27 తేదీన కురిసిన వర్షం రైతులను మరింత కుంగదీసింది. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, శనగ తదితర పంటలు సాగు చేసిన రైతులకు ముంపు సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే 70 వేల ఎకరాల్లో వరి పైరు నీట మునిగి రైతులు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయారు. కొంత మంది రైతులు రెండుసార్లు వెదపద్ధతిలో సాగు చేశారు. రెండుసార్లు వరి వేసిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. 70 వేల ఎకరాల్లో ఏ పంట వేయాల్లో అర్థంకాక రైతులు అయోమయంలో ఉన్నారు. అధిక వర్షాలతో పాటు కాల్వలను సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, కాల్వకట్టలు బలహీనంగా ఉన్నా పట్టించుకోకపోవడం వల్ల గండ్లు పడి పొలాల్లోకి నీరు అధికంగా చేరింది. దీంతో నష్టం మరింత పెరిగింది.

గుంటూరు జిల్లాలో జూన్‌లో 97.1 మిల్లీ మీటర్ల వర్షం ▶ 2లో

ఆగస్టులో అధిక వర్షాలు నమోదైన మండలాల వివరాలు

మండలం	అవసరం	నమోదు (మిల్లీ మీటర్లలో)
మేడికొండూరు	157.2	317.8
తాడికొండ	206.5	349.2
మంగళగిరి	206.5	301.2
తుళ్లూరు	195.5	339.0
చేబ్రోలు	145.4	396.2
దుగ్గిరాల	177.4	336.4
పెదకాకాని	154.3	375.2
ఫిరంగిపురం	145.3	288.6

ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన డిఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

హాజరు కానివారికి నేడు అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏసీ కాలేజి ప్రాంగణంలో రెండ్రోజులపాటు నిర్వహించిన డిఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ముగిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. రెండ్రోజుల్లో అన్ని మేనేజ్‌మెంట్లలో, అన్ని రకాల సబ్జెక్టులు కలిపి మొత్తం 1650 మంది అభ్యర్థులను పిలిచారు. రెండోరోజు 718 మందిని పిలిచారు. 30 మంది వివిధ కారణాలతో హాజరుకాలేదు. దీంతో నేటి వరకూ వారికి హాజరయ్యేందుకు అవకాశం కల్పించారు. ధ్రువపత్రాల పరిశీలనను ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి, కమిషనరేట్ అబ్జర్వర్ శైలజ, డిఇఒ సి.వి.రేణుక పర్యవేక్షించారు. ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రైవేటు వర్సిటీల్లో రాజధాని విద్యార్థులకు రాయితీలివ్వాలి

విట్‌తో భూ కేటాయింపులపై సమీక్షించాలి : సిపిఎం

ఎఎన్‌యు దూరవిద్య కోర్సుల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు దూర విద్య కేంద్రం (సిడిఇ) డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) 23 పీజీ కోర్సులకు అనుమతి లభించిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10 చివరితేదీగా చెప్పారు.

ఆర్ట్స్‌లో ఎంఎ ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం, హెచ్‌ఆర్‌ఎం వంటి 11 కోర్సులు, పీజీ కామర్స్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్స్ ఎం.కామ్ అకౌంటెన్సీ, బ్యాంకింగ్, ఎంబీఏ జనరల్ మొత్తం 3 కోర్సులు, లైబ్రరీ ప్రోగ్రామ్స్ మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సు.

సైన్స్ విభాగంలో ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ తదితర 8 సైన్స్ కోర్సులు. కోర్సుల కాల వ్యవధి, ▶ 2లో

జలాశయాల నుండి కొనసాగుతున్న నీటి విడుదల

- 2 లో

తొలిరోజు విజేత పల్నాడు జత

ప్రత్తిపాడులో రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నందమూరి తారక రామారావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో రాష్ట్రస్థాయి పశు బల ప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే బి.రామాంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభ సభకు తెలుగురైతు రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ జి.వెంకటేశ్వరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు అంతరించి పోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కొంత మంది రైతులు ఆస్తులమ్ముకొని వాటిని పోషిస్తున్నారని అభినందించారు. రైతులకు పంటతోపాటు పాడి కూడా ఉండాలన్నారు. సొసైటీల ద్వారా గేదెలను ఇచ్చి డెయిరీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తెగుళ్ళ, విచ్చలవిడిగా మందుల వాడకం కారణంగా పంటలు సరిగా పండడం లేదని, ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు.

అనంతరం నిర్వహించిన పోటీల్లో పాలపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం కావూరు-లింగంగుంటకు మైల త్రివేణి ఎడ్ల జత 3900 అడుగుల దూరాన్ని లాగి మొదటి ▶ 2లో

30 శాతం బార్‌లకు దరఖాస్తుల ఖరారు

నేడు లాటరీ తీయనున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం విక్రయాలకు బార్ల లైసెన్సుల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారం రాత్రి గడువు ముగిసింది. వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ ద్వారా లైసెన్సుదారులను గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు శనివారం ఎంపిక చేయనున్నారు. తొలుత ఈనెల 26 వరకు దరఖాస్తులకు గడువు విధించారు. స్పందన రాకపోవడంతో గడువును ఈనెల 29 వరకు పొడిగించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు అందిన సమాచారం ప్రకారం గుంటూరు జిల్లాలో 110 బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి నాలుగు దరఖాస్తులు రావాలన్న నిబంధనల మేరకు 36 బార్లకు 144 దరఖాస్తులు ▶ 2లో

ప్రజాశక్తి 45 వార్షికోత్సవం

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...

అమ్మిశెట్టి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

కుంచనపల్లి. సెల్ : 99120 81690

మేనేజింగ్ డైరెక్టర్ :

అమ్మిశెట్టి రాజేష్

గుంటూరులో వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల కొల్లి శారద హెూల్ సెల్ కూరగాయల మార్కెట్ వద్ద పాత వ్యాపారులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్ అధికారులు తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దుకాణాల లీజుకు ఇటీవల టెండర్ల నిర్వహించారు. పాత వ్యాపారుల స్థానంలో కొత్తవారు టెండర్లు కైవసం చేసుకున్నారు. కొత్తవారికి దుకాణాల్లో అప్పగించేందుకు కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్లు, ఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పెద్ద ఎత్తున తరలి వెళ్లి 24 షాపులను ఖాళీ చేయించి తాళాలు వేశారు. మిగిలిన షాపులు కూడా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో పాత వ్యాపారులంతా ఆందోళన దిగారు. నందివెలుగు రోడ్లో రాస్తారోకో చేశారు. అనంతరం కొద్దిసేపు ధర్నా చేపట్టారు. ఇటీవల ఈ మార్కెట్లోని షాపులకు లీజులు నిర్వహించారు. గతంలో ఆదాయం ఇప్పుడు రూ.6 కోట్ల పైగా ఆదాయ లభించింది. దీంతో ఆ షాప్ పాట పాడుకున్న వారికి అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు షాప్ లో ఉన్న స్వాధీన పరుచుకుని ఎందుకు వచ్చారు. దీన్ని గమనించిన పాత వ్యాపారులు తమకు కొంత కాలం గడువు కావాలని కోరారు. దీంతో కుదరదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. షాపులను స్వాధీనపరుచుకుంటారని భయంతో రోడ్డుకి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు వెంకట కష్ణయ్య, డి శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసు, ఆర్వోలు, ఆర్ ఐ లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సోదరుని హత్య కేసులో అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 22న సోదరుడిని హత్య చేసిన కేసులో నిందితుణ్ణి అరెస్టు చేసినట్టు గుంటూరు తూర్పు డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ తెలిపారు. రామిరెడ్డిపేట 3వ లైనులో కన్నెర్ల సురేష్‌పై అతని సోదరుడు రమేష్ పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేశాడు. సోదరులిద్దరికీ కొంతకాలంగా వివాదాలు నడుస్తున్న క్రమంలో హత్య జరిగింది. నిందితుణ్ణి సిఐ కె.వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

సిఐటియు నాయకులు వివి జవహర్లాల్. పేరు యాడ్ చేయగలరు

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని లోని నిడమర్రులో బషీర్బాగ్ విద్యుత్ పోరాట అమర వీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామీల 25వ వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమరవీరులను స్మరించుకుంటూ నేటి విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు అధ్యక్షతన సభలో సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎంరవి, రాజధాని డివిజన్ నాయకులు జె నవీన్ ప్రకాష్ ప్రసంగించారు. అమరవీరుల ఆశయ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరే కంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు గైరబోయిన నాగేశ్వరరావు కట్టె పోగు బుల్లిబ్బాయి మంచి కలపూడి రాజముని మంచి కలపూడి అంకమ్మరావు ఎమ్మేళ మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అతివృష్టి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

కురవాల్సి ఉండగా 65.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జులైలో 164.9 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా 223 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. ఆగస్టులో ఇప్పటి వరకు 164.7 మిల్లీ మీటర్లు వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికే 278.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మేడికొండూరు మండలంలో అధిక వర్షం వల్ల పత్తి పంట నీట మునిగింది. తాడికొండ మండలంలో వరి, పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. మంగళగిరి, చేబ్రోలు, పెదకాకానిలో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా తాడికొండ, మేడికొండూరు, మంగళగిరి మండలాల్లో కొండవీటి వాగు, పాల వాగు, కోటేళ్లవాగు వాగులతో పైర్లకు నష్టం జరిగింది. పెదకాకాని మండలంలో గుంటూరు ఛానల్ కాల్వగట్లకు గండ్లు పడటం వల్ల ముంపు సమస్య తలెత్తింది. చేబ్రోలులో ఒకే రోజు అతి భారీ వర్షం వల్ల ముంపు సమస్య ఉత్పన్నమైంది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే 20 నుంచి 30 శాతం మాత్రమే అధిక వర్షం కురవడం వల్ల ముంపు సమస్య తక్కువగా ఉంది. పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో పైర్లకు అపార నష్టం వాటిల్లింది. మొత్తం 18 మండలాలకు గాను 8 మండలాల్లో అవసరానికి మించి దాదాపు రెట్టింపు వర్షపాతం నమోదైంది. జులై, ఆగస్టులో అధిక వర్షాలు నమోదైన మండలాల్లో మేడికొండూరు, కొల్లిపర, ఫిరంగిపురం, చేబ్రోలు, దుగ్గిరాల, పెదకాకాని, ప్రత్తిపాడు మండలాలు ఉన్నాయి.

తొలిరోజు విజేత పల్నాడు జత

(మొదటి పేజీ తరువాయి)

బహుమతి సాధించాయి. కృష్ణా జిల్లా నాగలంక మండలం తలగడదివికి చెందిన ముమ్మా ప్రభు కుమారి - నాగలంక మండలం నంగేగడ్డకు చెందిన సంక పవన్ కంబైన్డ్ ఎడ్ల జత 3779.7 అడుగుల దూరంతో రెండో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం గంగవరానికి చెందిన బంక గురువరెడ్డి ఎడ్ల జత 3614.4 అడుగులతో మూడో స్థానం, ఎన్‌టిఆర్ జిల్లా, చందర్లపాడు మండలం చింతలపాడుకు చెందిన పయ్యావుల నాగేశ్వరావు ఎడ్ల జత 3568.1 అడుగులతో నాలుగో స్థానం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేళం పద్మనాయుడు-ఎన్ఆర్ జిల్లా చందర్లపాడు మండలం తోటరావులపాటుకు చెందిన కోటిరాజ్యం కంబైన్డ్ జత 3448.1 అడుగులతో ఐదోస్థానం దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం కోమటినేనివారిపాలేనికి చెందిన మండవ సూరిబాబు, దినేష్ చౌదరి - ఇదే మండలంలోని కావూరు-లింగంగుంటకు బేతంచర్ల చిన్ననర్సయ్య కంబైన్డ్ జతతోపాటు గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లికి చెందిన కాసుల వెంకట సుబ్బయ్య మెమోరియల్ ఎడ్ల జత 3300 అడుగుల చొప్పున దూరాన్ని లాగి ఆరో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యారం గ్రామానికి చెందిన పయ్యావుల శివనారాయణ, కొండలు ఎడ్ల జత 3204 అడుగుల దూరంతో ఏడో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఎడ్ల యజమానులకు పోటీల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

30 శాతం బార్‌లకు దరఖాస్తుల ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

ఖరారు కాగా మరో నాలుగు బార్‌లకు నాలుగు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. రాత్రి 11.59 నిమిషాల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులు రాని బార్లకు తదుపరి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. పల్నాడు జిల్లాలో 49 బార్లకు గాను ఇప్పటి వరకు 65 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో 16 దుకాణాలకు నాలుగు చొప్పున దరఖాస్తులు రాగా మరో బార్‌కు ఒక్క దరఖాస్తు వచ్చింది. మొత్తం 49లో 16కి మాత్రమే దరఖాస్తు రావడం వల్ల మిగతా వాటికి వచ్చేనెలలో మలి విడత నోటిఫికేషన్ ఇస్తారని అధికారులు తెలిపారు. మొత్తం 159 బార్లకు గాను 52 బార్లకు మాత్రమే లైసెన్సుల మంజూరుకు లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నారు. గౌడ్, గౌడ సామాజిక తరగతుల వారికి కేటాయించిన బార్‌కు 50 శాతం ఫీజు రాయితీ ఉండటం వల్ల వీటికి పూర్తిస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు జిల్లాలో ఈ సామాజిక తరగతుల వారికి 10 బార్‌లు కేటాయించగా 68 దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలో ఐదు కేటాయించగా 22 దరఖాస్తులు వచ్చాయి. వీటికి కూడా శనివారం జిల్లా కలెక్టర్ల సమక్షంలో లాటరీ తీసి లైసెన్సులను ఖరారు చేయనున్నారని అధికారులు తెలిపారు.

జలాశయాల నుండి కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో శుక్రవారం సాగర్ 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 20 గేట్లను ఐదు అడుగుల ఎత్తు, ఆరు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,43,862 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,88,302 క్యూసెక్కులు వస్తుండడంతో ఈ మొత్తాన్నీ దిగువకు వదిలేస్తున్నారు. కుడి కాల్వకు 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 33,211, ఎస్‌ఎల్‌బిసికి 2400, వరద కాల్వకు 300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 587.50 అడుగుల వద్ద ఉంది. ఇది 305.8030 టీఎంసీలకు సమానం.

పులిచింతలకు 2,80,282 క్యూసెక్కులు

రెంటచింతల మండలం సత్రశాలలోని నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 గేట్లకు గాను 17 గేట్ల ద్వారా పులిచింతలకు 2,80,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ కె. వెంకటరమణ తెలిపారు. 15 గేట్లు 3మీటర్లు, 2 గేట్లను ఐదు మీటర్లు ఎత్తి నిటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ నుంచి 2,77,316 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్ వస్తోంది. రిజర్వాయర్లో 74.42 మీటర్ల నీరుంది. ఇది 6.035 టీఎంసీలకు సమానం. విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసినట్లు ఎస్ఇ తెలిపారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ నుండి 3.94 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా అదే స్థాయిలో నీటిని బ్యారేజీకున్న 70 గేట్లు ఎత్తి నీటిని దిగువన సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వివిధ పంట కాల్వలకు 6700 క్యూసెక్కులను విడుదల చేసినట్టు బ్యారేజ్ అధికారులు తెలిపారు. మత్స్యకారులెవరూ నదిలోకి వెళ్లొద్దని అధికారులు సూచించారు. అయితే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, దీనికి డిఏ జత చేయాలని, ఈఎస్ఐ ద్వారా వైద్యసదుపాయం కల్పించాలని, హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ వేజెస్ అప్లికేషన్లు అన్నిటినీ పరిష్కరించాలని, రైల్వేలో టిక్కెట్‌పై రాయితీని పునరుద్దరించాలని తదితర డిమాండ్లతో ఆర్టీసి జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శేషగిరిరావు అధ్యక్షతన ధర్నా జరిగింది. ఎపిఆర్‌పిఎ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన ప్రస్తుత పెన్షన్ నేటికీ సవరించబడలేదని, అప్పుడు ఎంత ఉందో.. ఇప్పుడు అంతే ఉందన్నారు. వెయ్యి రూపాయల లోపు పెన్షన్ పొందుతున్న వారు దేశవ్యాప్తంగా లక్షలలో ఉన్నారని, ఎంప్లాయిస్ పెన్షన్ తాలూకా కట్ చేసిన సొమ్ము కార్పస్ అమౌంట్ రూ.9.89వేల కోట్లు కేంద్రం వద్ద ఉందని, పెన్షన్ పెంచమని కోరితే డబ్బులు లేవని సాకులు చెబుతుందన్నారు. ధర్నాలో ఈ సభలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఏ శాస్త్రి, ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కే. గంగాధరరావు ప్రసంగించారు. ధర్నాకు సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు అధ్యక్షులు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నరసయ్య , బ్యాంక్ ఎంప్లాయిస్ నాయకులు వి.సాంబశివరావు, జూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ.నికల్స్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి బి నాగేశ్వరావు ప్రసంగించారు. అనంతరం పిఎఫ్ రీజనల్ కమిషనర్ ప్రభుదత్తా ప్రుష్టికి వినతిపత్రం అందజేశారు. మరొక కమిషనర్ తానయ్య ధర్నా వద్దకు వచ్చి పెన్షనర్లతో మాట్లాడారు. డిమాండ్లను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

ఎఎన్‌యు దూరవిద్య కోర్సుల నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్హతలు, ఫీజులు తదితర వివరాలను షషష.ఖఅబషనవ.ఱఅటశీ వెబ్‌సైట్ నుంచి లేదా 0863-2346222, 9848477441 ఫోన్ నంబర్లకు సంప్రదించి తెలుసుకోవాలని వెంకటేశ్వర్లు సూచించారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు : 2025 విద్యా సంవత్సరానికి ఎంబీఎ, ఎంసీఏ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. దీని ద్వారా రెండేళ్ల కాలపరిమితితో ఉండే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీఏ కోర్సులో ప్రవేశం కోసం అభ్యర్థులు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండాలి. పదో తరగతి లేదా ఇంటర్ లేదా డిగ్రీలో తప్పనిసరిగా మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి. ఎంబీఏ కోర్సులో జనరల్‌లో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ మేనేజ్మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రావెల్ టూరిజం మేనేజ్మెంట్, బిజినెస్ ఎనాలిటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్మెంట్ మొత్తం 8 స్పెషలైజేషన్స్ ఉన్నాయి. అందులో రెండిటిని మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎంసీఏ కోర్సులకు డిగ్రీలో లేదా ఇంటర్‌లో మ్యాథ్స్ చదివి ఉండాలి. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులే. వచ్చేనెల 21న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఏపీ ఐసెట్ 2025లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని వెంకటేశ్వర్లు వివరించారు.

సిఆర్‌డిఎ గ్రీవెన్స్‌కు 59 అర్జీలు

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక సి ఆర్ డి ఎ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ లో అధికారులకు 59 అర్జీలు అందాయి. భూమి వ్యవహారాలకు సంబంధించి 55, సామాజిక సంక్షేమం విభాగానికి 2,డెవలప్ మెంట్ ప్రమోషన్ 1,ఎస్టేట్స్ 1చొప్పున అర్జీలను రైతులు,ఇతరులు సి ఆర్ డి ఎ అదనపు కమీషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ కు అందజేశారు.వీటితో పాటు వార్షిక కౌలు చెల్లింపు, ల్యాండ్ పూలింగ్ స్కీం, నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ, రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్, అసైన్డ్ ల్యాండ్ సమస్యలు, గ్రామకంఠాలు తదితర సమస్యల గురించి కూడా రాజధాని ప్రాంతవాసులు అర్జీలను అదనపు కమిషనర్‌కు ఇచ్చారు. అర్జీదారులు అందజేసిన సమస్య లను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ తెలిపారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం గం.10 నుంచి మధ్యాహ్నం గం. 1ల వరకు జరిగే గ్రీవెన్స్‌ను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. గ్రీవెన్స్ డేలో నోడల్ అధికారి పి జయశ్రీ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం శేషిరెడ్డి, కెఎస్ భాగ్యరేఖ, పి పద్మావతి, ఎ జి చిన్ని కష్ణ, జి రవీందర్, జి భీమారావు,సి ఆర్ డి ఎ సామాజిక సంక్షేమ విభాగం డిసిడిఓ బొర్రా శ్రీనివాసరావు, సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి పాండురంగ రావు, రామకృష్ణన్, డెవలప్ మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి హెచ్ మధుసూధనరావు, ఐటి విభాగ ప్రాజెక్టు మేనేజర్ పాల్గొన్నారు.

In the Court of the Hon'ble IV Addl Civil Judge (Junior Division) at Vijayawada
O.S.No. 103/2025

Between:
Paradi Srinivas - Plaintiff
and
Balusupati Nagar Sankar - Defendant

To
Defendant :
Balusupati Naga Sankar
S/o. Venkateswarlu
R/o. D.No. 11-453, Industrial Area,
Yerrabalem Village-522503.
Mangalagiri Mandal, Guntur Dist.

వాది పై నంబరు గల దావాను మీ పై దాఖలు చేయగా మీ హాజరు నిమిత్తం ది.22-09- 2025వ తేదీకి వాయిదా అయివున్నది. కావున మీరుపై తెలిపిన తేదీన ఉదయం గం. 10.30 నిIIలకు స్వయంగా కానీ, మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల దావావు మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

// By Order //
ఇట్లు
P. Rama Krishna Paramahamsa
వాది తరపు న్యాయవాది
విజయవాడ
వాయిదా తేది: 22-09-2025

రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం సమీపంలోని అల్లంవారిపాలెం వద్ద రైల్వే గేటుకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈనెల 29, 30, 31 తేదీలలో రైల్వే గేటు మూసివేయనున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజనీర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సమయంలో వాహనదారులు ప్రత్యామ్నాయంగా ఆరోగ్యనగర్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని ఉప యోగించుకుని సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యుత్ లైన్‌మెన్‌పై కటింగ్ ప్లేయర్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామంలో షేక్‌జానీ అనే వ్యక్తి మీటరు లేకుండా విద్యుత్ తీగలపై వైరువేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారు. ధూళిపాళ్ళ లైన్‌మెన్ బాణావత్ గోవిందా నాయక్ వైర్లను కట్ చేశారు. దీంతో జానీ అతని కుటుంబ సభ్యులు లైన్‌మెన్‌ను కులం పేరుతో దూషిస్తూ ఇనుప కటింగ్ ప్లేయర్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. లైన్‌మెన్ గోవిందనాయక్ సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆర్టీసీ తనిఖీల్లో 3 వాహనాలు సీజ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆర్టీసీ, రోడ్డు రవాణా శాఖ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెనాలి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు ఐజె ప్రసాద్ తెలిపారు. చేబ్రోలు మండలం నారా కోడూరు ఆర్టీసీ పాయింట్ వద్ద నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టినట్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సుమారు 35 వాహనాలను తనిఖీ నిర్వహించి రూ.36.5వేల అపరాధ రుసుము వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ధ్రువ పత్రాలు సరిగ్గా లేని ఏడు వాహనాలపై కేసులు నమోదు చేసామన్నారు. నిబంధనలు విరుద్ధంగా పట్టుబడిన మూడు వాహనాలను సీజ్ చేశామన్నారు. తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ చావలి సునీత, తెనాలి, గుంటూరు డిపోల ట్రాఫిక్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘం చైర్‌పర్సన్ షేక్ మదార్ సాహెబ్ అధ్యక్షతన పురపాలక సంఘ సాధారణ సమా వేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ డి.వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని వారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు అందరూ సమావేశానికి తప్పక హాజరు కావాలని, అధికారులు అందుబాటులో ఉండాలని కమిషనర్ వేణుబాబు కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని నరసరావుపేట ఒకటవ అదనపు సివిల్ జడ్జి జే.సలోమి అన్నారు. స్థానిక మండలంలోని నుదురుపాడు గ్రామంలో మండల న్యాయ సేవా కమిటీ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ జడ్జి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాల పై సమాచారం తెలుసుకొని సంబంధిత శాఖలకు ప్రజలు ఫిర్యాదులు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు తొందరపడి వివాదాలు పెట్టుకుని సమస్యలు పెద్దవి చేసుకొని కోర్టులు చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని హితవు పలికారు. గిరిజనుల్లో బాల్యవివాహాలు, ముందస్తు గర్భధారణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాలలో చదువు ఆరోగ్యంపైన అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయని అన్నారు వీటిని అరికట్ట అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జడ్జి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ జే.ప్రసాదరావు, ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, సీఐ కె శివరామకృష్ణ, ఎస్సై పి.సురేష్‌శిశు సంక్షేమ శాఖ అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు గ్రామ సర్పంచ్ గొట్టం నాగమల్లేశ్వరి, గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- తాడేపల్లి

సీతానగరం పుష్కర ఘాట్ వద్ద కృష్ణనదీ ప్రవాహంలోకి దూకి మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సమీపంలో పల్లెకారులు గమనించి వెంటనే ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు. విజయవాడ, భవానీ పురానికి చెందిన మహిళగా గుర్తించారు. పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చిన పల్లెకారులు, మహిళను తాడేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళను కాపాడుతున్న వ్యక్తి

ప్రకటన

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, వారి తరుపున చిలకలూరిపేట బ్రాంచ్ మేనేజర్ వారి నుండి పొందిన సమాచారం మేరకు తెలియజేయునది ఏమనగా

చిలకలురిపేట పట్న గాంధీపేట నివాసి అయిన నదం రమేష్ గారి భార్య మాధవి మరియు నందం రమేష్ గారి కుమారుడు హేమ సుందర వెంకట సాయి ఈ దిగువ షెడ్యూల్ ఆస్థిని తనఖాగా ఉంచి ఋణము కావలెనని కోరి ఉన్నారు. సదరు ఆస్థి నందం రమేష్ గారు 22.03.2022 వారి పేరిట దఖలు దస్తావేజు నెంబర్ 2430/2022 ద్వార చెంద చేసి ఉన్నారు అని, సదరు నందం రమేష్ గారు సదరు ఆస్తిని 19.08.2008 తారికున మద్దుకూరి విమల గారి వద్ద దస్తావేజు నెంబర్ 4023/2008 ద్వారా కొనుగోలు చేసి ఉన్నారు అని సదరు 4023/2008 దస్తావేజు పోయింది అని, సదరు విషయము గురించి పోలీస్ రిపోర్ట్ కూడా ఇచ్చి ఉన్నారు అని, పోలీస్ వారు విచారించి 17.03.2020 తారికున Not traced సర్టిఫికేట్ కూడా ఇచ్చి ఉన్నారు అని తెలియజేసినారు. కావున షెడ్యూల్ దాఖల ఆస్థి పైన ఎవరికీ అయినను, ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై బ్యాంకు వారికీ ఈ ప్రకటన తేది నుంచి 10 రోజులలోపు లిఖిత పూర్వకంగా సదరు బ్యాంకు వారికీ తెలియజేయగలరు. అట్లు లేని యేడల సదరు బ్యాంకువారు షెడ్యూల్ ధాఖల ఆస్థిపైన ఎవరికీ, ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి లోన్ ను మంజూరు చెయ్యగలరని తెలియజేయడమైనది. తదుపరి వచ్చిన అభ్యంతరములు స్వీకరిచబడవు అని మరియు సదరు బ్యాంకు వారి తనఖాకు బద్ధుడు చేయజాలదని తెలియజేయడమైనది.

షెడ్యూలు :-

నరసరావుపేట రి.డి.చిలకలూరిపేట సబ్.డి. యిలాకా, పురుషోతపట్నం గ్రామ డి.నెం. 146/C, చిలకలురిపేట మునిసిపల్ ఏరియా 24 బ్లాక్, పాత డోర్ నెం: 24-71, కొత్త డోర్ నెంబర్ 24-115/1, అసెస్మెంట్ నెంబర్ 1020018616 గల ఇల్లు స్థలమునకు హద్దులు: -

తూర్పు : గ్రంధి రామనాధం ఇంటి వెంబడి ఈ ఇంటి ప్రహరి గోడ హద్దు. అ 28 లు

దక్షిణ : కోడె గౌతమ్ కుమార్ గారి ఇల్లు స్థలం హద్దు. అ 34 లు

పడమర : కోడె అంజమ్మ తాలుకు స్థలం హద్దు. అ 28 లు

ఉత్తరం : పంచాయతీ బజారు హద్దు. అ 34 లు

ఈ హద్దుల మద్య చ.గ. 106.33 లకు సరియగు ఛమీ 89.31 విస్తీర్ణము గల స్థలమును సదరు స్థలములో నిర్మాణము చేయబడిన ఇల్లు.

పోలూరు పాండురంగ రావు
పోలూరు పురుషోత్తమరావు
న్యాయవాదులు

చిలకలూరిపేట
ది: 08.2022
సెల్ :98660 42356

LOSS OF PASSPORT

I, Koora Narasimhulu Rajini Kanth, S/o.Koora Krishnaswamy Narasimhulu, R/o.Flat No.101, Rakesh Grand Apartment,1st line Vidya Nagar,Guntur, A.P. I lost my **Original Passport No. E5760623** on Dt:12-08-2025 while I was travelling from College to home by two wheeler. If anybody found it please inform me. Cell: 9490584053.

వేలంలో రూ.6.40 లక్షలు పలికిన గనేష్ లడ్డు

ప్రజాశక్తి రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతల లోని ఆనందపేటలో ఉన్న గణేష్ లడ్డు వేలం పాటలో ఇంగుటూరి రాజశేఖర్ రెడ్డి రూ. 6లక్షల 40వేలకు దక్కించు కున్నారు. గత సంవత్సరం ఇదే గణేష్ లడ్డూ వేలంలో రూ.7లక్షల 10 వేలకు పలికిందని నిర్వాహకులు తెలిపారు.

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.48/2025 and ఐ.ఎ.నెం.107/2025

బిట్వీన్:
కనిగంటి లోకనాథం ....వాది/పిటీషనరు
మరియు
మువ్వల సుబ్రమణ్యం ... ప్రతివాది/ రెస్పాండెంటు,

మువ్వల సుబ్రమణ్యం, తండ్రి.ఆంజనేయులు, నివాసం డోర్ నెం.5-1-32-11,బ్రాడీ పేట, గుంటూరు (సిటీ & జిల్లా)

పై నెంబరు దావా నెం.48/2025లో ప్రతివాది మరియు సదరు దావాలోని ఐ.ఎ.నెం. 107/2025 పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు/నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు/ నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.04-09-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది.04-09-2025

కె.బ్రహ్మానందం,
సిహెచ్.బాబురావు,
వాది తరపు అడ్వకేట్స్,
1వలైను పట్టాభిపురం, గుంటూరు.

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL. DIST JUDGE:: GUNTUR
G.W.O.P. No. 1105 / 2025

Between:
Katragadda Srilakshmi, W/o.Venkateswarlu, R/o. Door No.12-27, Near Nagendra Swamy Temple, Pedakurapadu(V & Md),Guntur Dist. ...Petitioner
And
Nil .... Respondents

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు తన మైనరు కుమార్తె అయిన కాట్రగడ్డ నాగ ఉపాసన యొక్క విద్యా బుద్ధులు, బాగోగులు, పోషణ వగైరాలు కొరకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిలో మైనరు తాలూకు సగభాగం ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ కొరుతూ పిటీషను దాఖలుచేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన ఆక్షేపణలు అభ్యంతరములు వగైరాలు ఉంటే తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్‌నోటీసు నిమిత్తం **ది.09-10-2025**కి వాయిదావేసినారు.కావున ఆక్షేపణలు ఉన్న వారు వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పైకోర్టు వారి యెదుట హాజరై తెలుపుకొనగలరు.

Schedule: Guntur Dist, Narasaraopet Registration Dist, Amaravathi Sub Dt, Tadikonda(Md) within the limits of Pamulapadu Gram Panchayat Area, Pamulapadu(V), D.No.48-A, an extent of Ac.1.67 Cents of dry land, out of which an extent of Ac.0.75 cents on the Southern side being bounded by, **East:** Land belongs to Katragadda Venkata Krishna Rao, **South:**Land belongs to Shaik Khasim and others, **West:**Land Belongs to Kamepalli Sivaiah and others, **North:**Land belongs to Executants (Remaining Land) Within the above boundaries, an extent of Ac.0.75 cents or 0.303 Hectors of Dry land and its' ancient rights for transportation of Carts, other agricultural equipment including all easement Rights.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:**09-10-2025**

బి.వి. గౌరీ శంకర్, పిటీషనరు తరపు అడ్వకేట్,
ఆర్.టి.సి. కాలనీ, గుంటూరు, సెల్: 9440307641

మహారాజశ్రీ గౌరవనీయులైన ఆరవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు (ఎఫ్.టి.సి) :: బాపట్ల
Appeal Suit No.34/2024

బిట్వీన్:
జంపని భాగ్యలక్ష్మి ....అప్పీలెంట్
అండ్
1) మందలపు @ రామినేని విజయలక్ష్మి,
2) రామినేని సుబ్బయ్య చౌదరి .....రెస్పాండెంట్స్

To,
R-1: రామినేని సుబ్బయ్య చౌదరి, తండ్రి లేట్ రామకోటయ్య, హిందూ, వయస్సు 56, ములుకుదురు గ్రామము,పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా,

ఈ నెంబరు అప్పీల్ లో అప్పీలెంట్ అయిన జంపని భాగ్యలక్ష్మి, భర్త.అగ్ని జ్వాల నరసింహరావు, ములుకుదురు గ్రామము, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా అనువారు, మీ పై అప్పీలు దావాను (APPEAL SUIT No.34/2024) దాఖలు చేసి ఉన్నారు. శ్రీ కోర్టు వారు పలు పర్యాయములు నోటీసులు పంపించినను సదరు కోర్టు వారి నోటీసులను తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయవలసినదిగా ఆదేశించివున్నారు. కావున మీరు ది.26-09-2025 న ఉదయం 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ, లేదా పరోక్షముగా కాని హాజరు అయి మీ యొక్క అభ్యంతరములను తెలియజేయవలసినదిగా కోరటమైనది. లేనిచో మీ పరోక్షములో విచారించి తీర్మానించెదరని ఇందు మూలముగ తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది: 26-09-2025

ఇట్లు
మల్లెల ఈరేసు,అప్పీలెంట్ తరుపు అడ్వకేటు,పొన్నూరు,గుంటూరుజిల్లా
ది.23-08-2025 **పొన్నూరు.**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం,
ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. మెస్సర్స్ రాజ్యలక్ష్మి కాటన్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ శ్రీమతి ఉప్పు రాజ్యలక్ష్మి, ఫ్లాట్ నెం. 14, రామమూర్తి అపార్ట్‌మెంట్స్, 7వ లైన్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు-522005. **2. శ్రీ ఉప్పు సత్యనారాయణ,** తండ్రి: లక్ష్మయ్య, ఫ్లాట్ నెం. 104, పంచవటి అపార్ట్‌మెంట్స్, సంగడిగుంట, గుంటూరు. **3. శ్రీ ఉప్పు శంకర్ రావు,** తండ్రి: ఉప్పు లక్ష్మయ్య, ఫ్లాట్ నెం. 14, రామమూర్తి అపార్ట్‌మెంట్స్, బృందావన్ గార్డెన్స్, 7వ లైన్, పట్టాభిపురం, గుంటూరు-522005. **4. శ్రీమతి రాయిన విజయలక్ష్మి,** భర్త: లేట్ ఆర్. కోటేశ్వర రావు, బ్యాంక్ కాలనీ, కొత్తపేట, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా. **5. శ్రీ కోలా ఆది నారాయణ,** తండ్రి: బల రామయ్య, పందిళ్ళపల్లి గ్రామం, వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి మెస్సర్స్ రాజ్యలక్ష్మి కాటన్ ట్రేడర్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.14-05-2019** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 05-09-2019** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 14-05-2019** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:

ఆస్తి-2: గుంటూరులోని కొత్త కాలనీ సమీపంలోని అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం. 228, రీ సర్వే నెం. 228/ఈ లో ఉన్న కొలతలు 0.28 1/2 సెంట్లు లేదా 1379.40 చదరపు గజాల ఖాళీ నివాస భూమి శ్రీమతి రాయిన విజయ లక్ష్మి, భర్త: కోటేశ్వర రావు, మరియు శ్రీ కోలా ఆదినారాయణ, తండ్రి: బలరామయ్య గార్ల పేరున కలదు. **హద్దులు: తూర్పు:** శ్రీ గోరంట్ల నాగేశ్వర రావు గారికి చెందిన ఆస్తి - 173 లింకులు, **దక్షిణం:** శ్రీ గాజుల నారాయణ గారి ఆస్తి - 165 లింకులు, **పడమర:** 50 లింకుల ఉమ్మడి రోడ్డు - 173 లింకులు, **ఉత్తరం:** ఉప్పు సత్యనారాయణ మరియు ఇతరులకు చెందిన భూమి - 165 లింకులు. రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 597/2005, తేదీ: 03.02.2005 ప్రకారం ఈ వివరాలు ఇవ్వబడ్డాయి.

తేది: 06.08.2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

NARASARAROPET MUNICIPALITY, NARASARAOPET
'e' – Procurement – Tender Notice
Tender Notice No.147/2025/E1, Dt.29-08-2025

1	Total No of Works	**1 No. of work** (Nit.No.19A/2025-26 – Short tender – 1st call.	**3 Nos. of works** 20A/2025-26 to 22A/2025-26 – 1st call.
2	Total Estimate Value of Works	**Rs.9,88,000/-**	**Rs.42,00,000/-**
3	Bid document download starting date.	30-08-2025 11:00 AM	30-08-2025 11:00 AM
4	Bid document download end date.	08-09-2025 04:00 PM	15-09-2025 04:00 PM
5	Last Date & Time for receipt of Bids.	08-09-2025 05:00 PM	15-09-2025 05:00 PM
6	(Nit.No.**19A/2025-26 and 21A/2025-26 – (Municipal General Funds) and 20A/2025-26 – (SDRF Funds) and 22A/2025-26 - Puda Grant)**		

Note: Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued. Further details can be seen @ e-Procurement market place at **www.tender.apeprocurement.gov.in**

Sd/- Commissioner, NARASARAOPET MUNICIPALITY, NARASARAOPET.

ఎరువుల కొరత.. ధరల మోత..

- యూరియా కట్ట రూ.400కు అమ్ముతున్న వ్యాపారులు
- ఎంఆర్‌పికి కావాలంటే ఇతర మందులైనా కొనాలని షరతు
- ప్రకటనలతో సరిపుచ్చుతున్న అధికారులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతు పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అనే తీరున ఉన్నది. పైర్లు సాగు చేసి అవసరమైన ఎరువులు కొనుగోలు చేద్దామని వెళితే వాటికి రెక్కలు వచ్చాయి. మండలంలో వాణిజ్య పంటలతోపాటు ఆహార పంటలు కూడా సాగవుతున్నాయి. పత్తి గతేడాది 8 వేల ఎకరాల్లో సాగవగా ఈ ఏడాది దాదాపు అదే విస్తీర్ణంలో సాగవుతుందని అంచనా. ఎకరా పత్తికి 50 కేజీల డిఎపి బస్తా ఒకటి, ఒక బస్తా పొటాష్, ఒకటిన్నర నుండి రెండు బస్తాల వరకు యూరియా వేయాల్సి ఉంటుంది. ఇవి అందుబాటులో లేకపోతే కాంప్లెక్స్ ఎరువులు అందుకు అనుగుణంగా వినియోగించుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పత్తి జూన్ 27వ తేదీన విత్తగా రెండు నెలలు కావచ్చింది. రెండవ దశలో జులై 18వ తేదీన విత్తగా ఆ పైరుకూ ఎరువుల అవసరం ఏర్పడింది. అయితే ఎరువుల కొరత ఒకవైపు, ధరలు పెరగడం మరోవైపు పైరుకు ఇబ్బందితోపాటు రైతులకూ ఆర్థిక భారమైంది.

డిఎపి ఎంఆర్‌పి ధర రూ.1350 ఉండగా రూ.1450 అమ్ముతున్నారు. ఎవరైనా ఎంఆర్‌పికి అమ్ముతున్నారంటే అందుకు ప్రతిగా ఇతర బయో ఫెర్టిలైజర్, మందులను కొనేలానే షరతు పెడుతున్నారు. యూరియా ఎంఆర్‌పి ధర రూ.267 కాగా రూ.400కు అమ్ముతున్నారు. అది కూడా షాపుల యజమానులకు అనుకూలంగా ఉన్నవారికే ఇస్తున్నారు. వాస్తవ ధరలకు అమ్మాలని అడుగుదుంటే... 'మేము బ్లాక్ మార్కెట్లో కొనుక్కొచ్చాం. కావాలంటే తీసుకెళ్లండి లేకపోతే లేదు' అని దుకాణదార్లు ఖరాఖండీగా చెబుతున్నారు. కొందరు బిల్లులు ఇవ్వకుండా విక్రయిస్తుంటే మరికొందరు ఇచ్చినా ఎంఆర్‌పి ధరకు అమ్మినట్టే ఇస్తున్నారు. దీనిపై అధికారులను సంప్రదిస్తుంటే రైతుసేవ కేంద్రాలకు, జిడిసిఎంఎస్ కేంద్రాలకు ఎరువులు వస్తాయని చెబుతున్నారు. రైతులు ఆందోళన పడొద్దంటున్నారు. అధిక ధరలకు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇవన్నీ ప్రకటనలకు మినహా రైతులకు ఏమీ అక్కరకు రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని, లేకుంటే పైరుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బి.రాంగోపాల్‌రావు చెబుతున్నారు.

వారం రోజులుగా ఒక్క బస్తా యూరియా లేదు!

గోదాముల్లో సిపిఎం పరిశీలన

ప్రజాశక్తి - క్రోసూరు

యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో స్థానిక మార్కెట్ యార్డులోని గోదాము, గ్రోమోర్ ఎరువుల గోడౌను, క్రోసూరు సొసైటీ గోడౌను, రైతుసేవ కేంద్రాలను సిపిఎం శుక్రవారం పరిశీలించింది. గోడౌన్ ఇన్‌ఛార్జులతో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు చర్చించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన రూ.266.5 ధరకు రైతులకు అందాల్సిన యూరియా వారం రోజులుగా ఒక్క గోదాములో కూడా ఒక్క బస్తా అయినా లేదన్నారు. ప్రైవేటు షాపుల్లో మాత్రం దొరుకుతున్నాయని, వారు కట్ట రూ.400 అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. యూరియా అవసరమని జిల్లా అధికారులకు గోదాములు ఇన్‌ఛార్జులు సమాచారం ఇచ్చినా సరఫరా కాలేదన్నారు. యూరియా కొరత లేదని, సొసైటీలు, జిడిసిసి విక్రయ కేంద్రాలు, రైతుసేవ కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని జిల్లా అధికారులు ప్రకటనలు చేస్తున్నా రైతులకు మాత్రం అందుబాటులో లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో వరి, పత్తి, మిర్చి పైర్లకు ఏకకాలంలో యూరియా అవసరమని, ఈ నేపథ్యంలో సరఫరాను పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి టి.హను మంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం యూరియాను అందుబాటులో ఉంచకుండా నానో యూరియాని వాడాలనడం హాస్యాస్పదమన్నారు. నానో యూరియా గురించి రైతుల్లో అవగాహన పెంచి, దాని మంచి చెడులను వివరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.ఏసయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరు వరకూ పంటల బీమా అవకాశమివ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంటల బీమా గడువును వచ్చేనెల 31 వరకు పెంచాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు కోరారు. ఈ మేరకు నరసరావుపేట మండల వ్యవసాయ శాఖాధికారి ఐ.శాంతికి శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పంటల సాగు ఇప్పటివరకు నత్తనడక నడిచిందని, ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయని చెప్పారు. అయితే వరికి ఈ నెల చివరితో పంటల బీమా గడువు ముగుస్తుందనే ప్రకటనతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు కౌలు ఒప్పందాలు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. కౌలు రైతులకు జిల్లాలో ప్రభుత్వం 67 వేల గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్దేశించినా ఇప్పటికి 20 వేల మందికే ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహం, రాయితీలు దక్కక వారు సంక్షోభంలో ఉన్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోయారని అన్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో సాగయ్యే అన్ని పంటలకు వచ్చేనెల 31 వరకు బీమా గడువు పెంచాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లురావు, ఎన్.రామారావు ఉన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి

ప్రజాశక్తి - వినుకొండ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు తమను ఆహ్వానించ నందుకు నిరసనగా మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వైసిపి కౌన్సిలర్లు బహిష్కరించారు. కౌన్సిల్ హాలులో శుక్రవారం జరిగిన సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు 8 మంది, టిడిపి కౌన్సిలర్లు 8 మంది హాజరు కాగా అందరూ హాజరైనట్లు హాజరు పట్టికలో సంతకాలు చేశారు. కోరం ఏర్పడిన తర్వాత వైసిపి కౌన్సిలర్లు రాజేష్ ఖన్నా, గంట కాలేశా, బేతం గాబ్రియల్, పాపసాని బ్రహ్మయ్య, సానాల పుల్లయ్య, జయరాజు, చాపల మడుగు మహబూబ్ బీ, బత్తుల వీరమ్మ, షేక్ బాషా, కో ఆప్షన్ సభ్యులు దేవదాసు... జెండా వందనం కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం కౌన్సిలర్లను ఆహ్వానించలేదని, ఎంపిడిఒ కార్యాలయం వద్ద తొలగించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని మున్సిపాలిటీ నిధులతో ఏర్పాటు చేయాలని కోరిన పట్టించుకోలేదని, ఇందుకు నిరసనగా తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించి వెళ్లిపోయారు. అయితే డిసెంట్ నోట్ ఏమీ ఇవ్వలేదు. అనంతరం ఛైర్మన్ దస్తగిరి అధ్యక్షతన సమావేశాన్ని కొనసాగించి 36 అంశాలతో కూడిన ఎజెండాను ఆమోదించారు. కమిషనర్ సుభాష్ చంద్రబోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గరవ్వండి : ఎస్‌పి

ప్రజాశక్తి - నాదెండ్ల : పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. నేరాలను నియంత్రించాలని, పెండింగ్ కేసులను తగ్గించాలని, చోరీ కేసుల్లో సొత్తు రికవరీపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పెండింగ్‌పై వివరాలడిగి విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంచాలని, సమస్యాత్మక ప్రదేశాల్లో గస్తీ పెంచాలని చెప్పారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగానికి వీల్లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై నేరాలను, సైబర్ మోసాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ఎస్పీ వెంట చిలకలూరిపేట రూరల్ సిఐ బి.సుబ్బానాయుడు, నాదెండ్ల ఎస్ఐ జి.పుల్లారావు ఉన్నారు.

సాగర్ డ్యామ్‌ను సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ డ్యామ్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు క్రస్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహాన్ని, నూతన వంతెన వద్ద నుంచి పరిశీలించారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహిళల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు మండలంలోని దూళిపాళ్ల లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో శని, ఆదివారాల్లో జరగనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా అమెచ్యూర్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.వంశీకృష్ణారెడ్డి, పి.సామంత్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. లోగోను ఆవిష్కరించిన వారు మాట్లాడుతు క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఆమదాలవలస ఎమ్మెల్యే కోన రవికుమార్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఎ.రవి నాయుడు పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల సాఫ్ట్‌వాల్ టీములు పాల్గొంటాయన్నారు.

'స్మార్ట్ మీటర్లపై అధికారుల అవాస్తవ ప్రచారం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నష్టాల సాకుతో రకరకాల రూపాల్లో రూ.కోట్ల అదనపు భారాలను విద్యుత్ వినియోగదారులపై వేస్తున్నారని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వినియోగదార్లకు ఇష్టం లేకుండా స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని మంత్రి ప్రకటించినా కచ్చితంగా బిగిస్తామంటూ ఉన్నతాధికారులు చెబుతున్నారని, పైగా నష్టమేమీ ఉండదంటూ విద్యుత్ డిఇ ఏడుకొండలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపేయాలని, ప్రజలపై వేసిన భారాలను రద్దు చేయాలని, ఇప్పటి వరకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించి సాధారణ మీటర్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

పల్నాడు జిల్లాకు జాషువా పేరు పెట్టాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్లు మార్పు చేర్పులు చేపట్టిన నేపథ్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పేరు పెట్టాలని గుర్రం జాషువా జిల్లా సాధన సమితి కన్వీనర్ కొరివి వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న ఐఎంఎ సమావేశ మందిరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సమితి ఛైర్మన్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, టిటిడి పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, గుర్రం జాషువా మనవడు బిఆర్ సుశీల్ కుమార్, పల్నాడు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

అలంకార ప్రాయంగా...
సామాజిక ఆరోగ్య కేంద్రం

తుళ్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం..

- రాత్రి వేళల్లో వైద్య సేవలకు దూరంగా పిహెచ్‌సి
- అందుబాటులో లేని 108 వాహనం
- ప్రయివేటు ఆసుపత్రుల నిర్వాహకుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం (30పడకల ఆసుపత్రి) అలంకారప్రాయంగా మారింది. రూ 3.35 కోట్ల వ్యయంతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంకు ఏప్రియల్ 8,2016లో అప్పటి రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ శంకుస్థాపన చేయగా, ఫిబ్రవరి 9, 2019లో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కానీ ఏళ్ళు గడుస్తున్నా వైద్యులు, సిబ్బంది నియామకం జరగక పోవడంతో ఆ మేరకు వైద్య సేవలు అందడం లేదు. 1954 లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తిగా శిథిలం కావడం, తుళ్లూరు ప్రాంతాన్ని ప్రభుత్వం రాజధానిగా ప్రకటించడంతో ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంను నిర్మించింది. రూ కోట్ల వ్యయంతో ప్రభుత్వం రాజధానిలో బ్రహ్మాండంగా ఆసుపత్రిని నిర్మించింది.. వైద్యులను, సిబ్బంది నియామకం మరిచిందని ప్రజలు వాపోతున్నారు. 2 అంతస్తుల సామాజిక ఆరోగ్య కేంద్రంలో మొదటి ఫ్లోర్ లో డాక్టర్ల గదులు,ఆపరేషన్ థియేటర్లు, పరీక్ష గదులు, డిస్పెన్సరీ, క్యాజువాలిటీ, డెంటల్, ఆయుష్, ల్యాబ్‌లు, ఎక్సరే, ఈసీజీ, మహిళల వార్డులు ఉన్నాయి. ఆసుపత్రిలోకి వెళ్లి చూస్తే ఉత్త బోర్డులు తప్ప వైద్యులు కానీ, సిబ్బంది కానీ కనపడరు. దీంతో చేసేది లేక దూర ప్రాంతాలకు, స్థానికంగా ఉన్న ఆర్ఎంపి డాక్టర్ల వద్దకు వెళ్లి డబ్బులిచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 2019లో ఆసుపత్రి ప్రారంభమైంది. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది.వైసిపి ఐదేళ్ల పాలన లోనూ వైద్యులు,సిబ్బంది నియామకం జరగలేదు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది దాటినా ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, తుళ్లూరు, పరిసర గ్రామాలకు చెందినవారు వైద్య సాయం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని అంటున్నారు.

రాత్రి వేళల్లో వైద్య సేవలకు దూరంగా పి హెచ్ సి..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) శిథిలం కావడంతో వైద్యులు, సిబ్బంది పక్కనే ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలోకి మారి వైద్య సేవలు అందిస్తు న్నారు. పేరుకు 24గంటల వైద్యశాల అయినప్పటికీ రాత్రి వేళల్లో వైద్య అందని పరిస్థితులు నెలకొన్నాయి. క్వార్టర్లు లేవనే సాకుతో డాక్టర్లు నివాసం ఉండక పోవడంతో రాత్రి వేళల్లో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని రోగులు వాపోతున్నారు.రాత్రి వేళ అత్యవసరంగా వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే కేవలం ఎఎన్ఎం మాత్రమే విధుల్లో ఉంటున్నారని అంటున్నారు.

అందుబాటులో లేని 108..

మెరుగైన వైద్యం కోసం అత్యవసరంగా గుంటూరు, విజయవాడ లాంటి పట్టణాలకు వెళ్లేందుకు 108 వాహనం అందుబాటులో లేదు. ఫోన్ చేస్తే అమరావతి,మంగళగిరి నుంచి రావాలని, గంట పైనా సమయం పడుతుందని, ఈలోగా జరగరానిది జరుగుతుందేమోననే భయంతో రూ వేలు చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్చి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయివేటు వైద్యశాలల హవా..

సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం, పిహెచ్‌సిలో పూర్తి స్థాయిలో ఆరోగ్య సేవలు అందక పోవడంతో అనివార్యంగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రాజధాని నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రులు పెద్ద సంఖ్యలో వెలిశాయి. సరిపడా భవనాలు, రోగులకు అవసరమైన సౌకర్యాలు లేకుండానే ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. అర్హత లేనివారిని కొద్దిపాటి నెలవారీ జీతాలు ఇచ్చి ఆసుపత్రులలో ఉంచుతున్నారు.వీరు రోగుల పేర్లు,ఆరోగ్య సమస్యలకు సంబంధించిన చీటీలు రాయడం దగ్గర నుంచి మందు బిళ్ళలు ఇవ్వడం వరకు చేస్తుంటారు.చాలా ఆసుపత్రులకు అనుమతులు లేవన్న ప్రచారం జరుగుతోంది. బయటకి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బోర్డులు..రకరకాల వైద్య నిపుణుల పేర్లతో బోర్డులు దర్శన మిస్తున్నాయి. తీరా చూస్తే ఒకరిద్దరు వైద్యులుండి అర్హత లేకున్నా అన్ని వ్యాధులకు వైద్యం చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులలో మాదిరి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంతంగా ల్యాబ్ లు,మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకొని ఎక్కువ సొమ్ములు గుంజుతున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

వలస కార్మికుల పిల్లలతో ఎంఈఓ అజయ్ కుమార్, తదితరులు

బడిలో చేరిన వలస కార్మికుల పిల్లలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల పిల్లలు ఉపాధ్యాయుల చొరవతో బడిలో చేరారు. మండలంలోని నెక్కల్లు ఎంపిపి పాఠశాలలో చేరిన కార్మికుల పిల్లలకు శుక్రవారం ఎంఈఓ1 ఎన్.అజయ్ కుమార్ స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, షు, పుస్తకాలను అందజేశారు. వలస కార్మికుల పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేసిన నెక్కల్లు ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు పి.దేవకి, సిఆర్‌పిపి ఆనందరావును ఎంఈఓ అభినందించారు.

ఎస్ఆర్ఎం లైబ్రేరియన్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అవార్డును అందుకుంటున్న డాక్టర్ జానకిరామన్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లైబేరియన్ డాక్టర్ ఏ. జానకిరామన్‌కు తమిళనాడులో ప్రతిష్టాత్మకంగా భావించే డాక్టర్ నిత్యానందమ్ లైమ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు - 2025 లభించింది. ఇండియాలో ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ గా గుర్తింపు ఉన్న పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్ఆర్ రంగనాథన్ 133వ బర్త్ యూనివర్సరీ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న చెన్నై అన్నా సెంటీనరీ లైబ్రరీలో పురస్కార ప్రదానం జరిగింది. తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఆర్ముగమ్ చేతుల మీదుగా డాక్టర్ జానకిరామన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. లైబ్రరీ మరియు సమాచార శాస్త్ర రంగాలకు డాక్టర్ జానకిరామన్ అందించిన సేవలు, లైబ్రరీ వృత్తిపట్ల ఆయనకున్న అంకిత భావం, గ్రంథాల పరిరక్షణలో ఆయన మాపుతున్న శ్రద్ధను ప్రామాణికంగా ఆయనకు అవార్డును ప్రధానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆవార్డు గ్రహీత జానకిరామను ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యంతో పాటు పలువురు ప్రొఫెసర్లు, ఉద్యోగులు అభినందించారు..

టీడీపీ సీనియర్ నేత కొల్లి లక్ష్మయ్య చౌదరి కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కొల్లి లక్ష్మయ్య (ఫైల్)

నవులూరులో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి లక్ష్మయ్య చౌదరి శుక్రవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 60 సంవత్సరాలు. ఆయనకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. రాత్రి అనారోగ్య సమస్యతో విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించగా శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. లక్ష్మయ్య చౌదరి గ్రామ సర్పంచ్‌గా, రాష్ట్ర సర్పంచుల సంఘం కన్వీనర్, యర్రబాలెం ఎంపీటీసీ సభ్యులుగా పదవులు నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్‌టి రామారావుకి సన్నిహితంగా ఉండేవారు. నియోజకవర్గంలో టిడిపిలో క్రియాశీలక పాత్ర పోషించి పార్టీ అభివృద్ధికి కృషి చేసి మంచి గుర్తింపు పొందారు. లక్ష్మయ్య చౌదరి మఅతి పట్ల సీనియర్ టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, తాడిబోయిన మహేష్ యాదవ్, గోవాడ బ్రదర్స్ సంతాపం ప్రకటించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

డ్రోన్ అందజేస్తున్న అధికారులు

80 శాతం రాయితీపై డ్రోన్ అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని వడ్డ మాను గ్రామానికి చెందిన చంద్రన్న కిసాన్ డ్రోన్ గ్రూపునకు చెందిన రైతు పారా బుజ్జి, గ్రూపు సభ్యులకు డ్రోన్‌ను 80శాతం రాయితీపై మండల వ్యవసాయ శాఖాధికారి పి.సంధ్యారాణి గురువారం అందజేశారు. డ్రోన్‌ను యూనియన్ బ్యాంక్, అనంతవరం బ్రాంచ్ మేనేజర్ కె.చిట్టిబాబు, డ్రోగో డ్రోన్స్ కంపెనీ రిప్రజెంటేటివ్ ఫృథ్వి పరిశీలించారని, డ్రోన్ ఖరీదు రూ.9,80,000లు కాగా సబ్సిడీ రూ.7,84,000 (80శాతం) అని సంధ్యారాణి తెలిపారు.

సిబార్‌లో క్వాంటమ్ వ్యాలీ ఇంటర్నల్ హ్యాక్ థాన్

ప్రజాశక్తి - పెదకాకాని

పాల్గొన్న వైద్య విద్యార్థులు

తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో క్వాంటమ్ ఇంటర్నల్ హ్యాక్ థాన్ నిర్వహించినట్లు కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి శుక్రవారం తెలియజేశారు. ఈ హ్యాక్ థాన్లో 3జట్లుగా 18 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో ఎంపిక చేసిన రెండు జట్లు సెప్టెంబర్ సెమీఫైనల్స్‌లో పాల్గొంటారని తెలియజేశారు. సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవం కలిగిన క్వాంటమ్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ రూషికేష్ ఉబాలే, ప్రముఖులు హ్యాక్ థాన్‌కు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సెమీ ఫైనల్స్ కు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెదకాకాని

మాట్లాడుతున్న శివాజీ

నంబూరు విజయభాస్కర్ నగర్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ సెక్టార్ సమావేశం కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, చాలీచాలని జీతాలు తీసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్నారని అలాంటి అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించవు అంటూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి ఇబ్బందిగా మారాయని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ నుండి నిధులను విడుదల చేయాలని, తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఉచిత విద్యుత్, ఇతర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. హెల్పర్లను వర్కర్లుగా ప్రమోట్ చేసి ఖాళీ స్థానాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్లకు కనీస వేతనం ఇవ్వాలని టిఎ, డిఎ ఇవ్వాలని , వేసవికాలం సెలవులు ఇవ్వాలని నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని, అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని పోషన్ ట్రాకర్ యాప్‌ను రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.రాజ్యలక్ష్మి కె.పావని, ఎస్.ఇందువాణి, టి.వరకుమారి, పి.కనకవల్లి, పి.అంజనాదేవి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య

ప్రజాశక్తి - మంగళగిరి

వచ్చేనెల 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలలో మంగళగిరి ప్రాంతం నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య కోరారు. సిఐటియు విస్తృత సమావేశం పట్టణ అధ్యక్షులు వై.కమలాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు పేరుతో కార్మిక హక్కులను కాలరాసే విధానాలను తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శిం చారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పనిచేసేది సిఐటియు మాత్రమేనని అన్నారు. ఎన్నో సంవత్సరాలగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, నాయకులు వి జవహర్‌లాల్, యు.దుర్గారావు, సిఐటియు నాయకులు శ్రీరాములు, షేక్ జానీ భాష, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కె.వెంకటేశ్వరమ్మ, వై.శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావుకు రూ. 1,06,239లు రెంటపాళ్ళ గ్రామానికి చెందిన నంబూల జస్వంత్‌కు రూ.79,698లు, సత్తెనపల్లి పట్టణానికి చెందిన సాకి అమర వాణికి రూ. 62,729లు రాజుపాలెం మండలం కోట నెమలిపూరి గ్రామానికి చెందిన వేపూరి రామయ్యకు 58,714రూపాయలు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు మాజీ యార్డు చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు టిడిపి నాయకులు పూజల వెంకట కొటయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ వ్యాప్తంగా అర్జీలతో వచ్చే ప్రజల ప్రతి సమస్య పరిష్కారమే అధికారుల తొలి ప్రాధాన్యం కావాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. తమ వద్దకు వచ్చే ఫిర్యాదులు, అర్జీలు ఎప్పుడైతే సున్నాకు చేరుకుంటాయో అప్పుడే ప్రజాదర్బార్ కార్యక్రమాలకు నిజమైన సార్థకత అన్నారు. వినుకొండ పట్టణం కొత్తపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు నేరుగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని వారికి అండగా ఉంటామని, పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, పోలీస్, తాగునీటి సహా వివిధ సమస్యలపై 41 అర్జీలు వచ్చాయి. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ నియోజకవర్గం అభివృద్ధి, స్థానిక, ప్రజా సమస్యలకే ఎల్లవేళల తన తొలి ప్రాధాన్యమన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఎప్పుడైనా తన కార్యాలయానికి రావచ్చిని.. ఈ ప్రజాదర్బార్ ఒక వేదిక మాత్రమే అంటూ ప్రతీ క్షణం నేను ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రైతులు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేటలోని లాడ్జీలు, హోటళ్లపై శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. రమణారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో విషజ్వరాలు విజృంభించడం, ఫుడ్ పాయిజన్‌తో పలువురు విద్యార్థులు ఆసుపత్రుల్లో చేరారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన ఆహారం అందించే విషయంలో నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. హోటళ్లు, రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ బండ్లు, న్యూడిల్స్ బండ్లు, కోడి పకోడీ, మసాలా బండ్లను పరిశీలించారు. లాడ్జీలలో ఉపయోగించే దిండ్లు, దుప్పట్లు, వ్యక్తిగత మురుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలిం చారు. దోమల నియంత్రణ, వేస్టేజ్ వాటర్ డ్రైనేజీలోకి వెళ్ళే మార్గం, శానిటేషన్, లాండ్రీవ్యవస్థ, ప్లాస్టిక్ వాడకం వంటి అంశాలను కూడా తనిఖీ చేశారు. వీటిపై నివేదిక తయారు చేసి మున్సిపల్ కమిషనర్‌కు అందచేస్తామని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

హరికృష్ణకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి హరికృష్ణ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని టిడిపి ప్రజా వేదిక లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అభివద్ధికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేని వని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్వలి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరి గ్రంథాలయంలో వాసవి కన్యక పరమేశ్వరి ధర్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవం జరిగింది. ధర్మ సంఘం అధ్యక్షులు పసుమర్తి సూర్య ప్రకాశరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూల దండవేసి నివాళులు అర్పించారు. ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు తప్పులు లేకుండా తెలుగు రాయడం, మాట్లాడటం, చదవడంలో పోటీలు నిర్వహించి భామాఫ్యాషన్ అధినేత కొంజేటి వేంకటరత్నం దంపతుల సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధర్మ సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం సాంబ శివరావు, సాహితీ విమర్శకులు డాక్టర్ పి.వి.సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్రకార్యదర్శి డాక్టర్ దార్లబుజ్జిబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, బొప్పుడి వెంకటేశ్వర్లు, బి.అజయ్‌బాబు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

తెలుగు కమ్మనైన భాషా అనీ, ప్రతి విద్యార్థి తెలుగు మాధుర్యాన్ని తెలుసుకోవాలని మంచికల్లు జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎం సిలార్ అహ్మద్ కోరారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు టీచర్ శారదను సన్మానించారు. టీచర్లు వీరవసంతకుమారి, సాయిభాస్కర్, జానీ, నాగరాజు, మాధవరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషోపాధ్యాయులు డి.పెదయాసప్‌ని పాఠశాల అధ్యాపకులు దుశ్శాలువలతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవి నాగమణి మాట్లాడుతూ, విద్యార్థులకు గ్రాంధిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడు, భాషాఉధ్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని అన్నారు. విద్యార్థులకు శతకపద్యాల పోటీలు నిర్వహించారు. శ్రీనివాసరావు, రామ్మోహన్, నారాయణ, పాల్గొన్నారు.

ఏపీఆర్డీసీలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు

విజయపురి సౌత్‌లోని ఏపీఆర్డిసి కళాశాలలో నిర్వహించారు. తెలుగు విభాగం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ నయీంభాను అధ్యక్షత వహించి మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు సేవలను కొనియాడారు. ఆంగ్లభాషోపాధ్యాయులు బాషా మాట్లాడుతూ వృత్తిపరంగా ఆంగ్లాన్ని బోధించినప్పటికీ తెలుగు భాషంటే ఇష్టమనీ, విద్యార్థులు తెలుగును అభ్యసించాలని కోరారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ రత్నశేఖర్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు నరసరావుపేట పట్టణం స్టేషన్ రోడ్‌లోని గాంధీ పార్క్ వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం మన సాంస్కృతిక వారసత్వానికి మైలు రాయన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన భాష మాధుర్యం, సౌందర్యం ఏ భాషలోనూ లేవన్నారు. గిడుగు రామమూర్తి ఆలోచనలు మనకు మార్గదర్శకాలుగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేట మండలం జొన్నగడ్డ గ్రామ పరిధిలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం తెలుగు భాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి జన్మదిన వేడుకను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు భాష శాఖాధిపతి అన్నపూర్ణ మాట్లాడుతూ గ్రాంథిక భాషలో తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చిన వ్యవ హారిక భాషోద్యమ మూలపురుషుడు, వాడుక భాషయోధుడని కొనియాడారు. నిమ్నజాతుల వారి కోసం గిడుగు వారు చేసిన కృషిని సవర భాషలో రాసిన నిఘంటువుల గురించి వివరించారు. విద్యార్థులు తెలుగు పద్యాలను, గేయాలను, పాటలను ఆలపించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ బర్నబాస్, స్కూల్ క్యాంపస్ ఇంచార్జ్ బాపూజీ, తెలుగు శాఖ ఉపాధ్యాయులు రాణి, భూపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు, జరిమానా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సోషల్ మీడియా వివాదం నేపథ్యంలో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువు అవడంతో నిందితులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష రూ. 10వేల జరిమానా విధిస్తూ స్థానిక అవునపు సహాయ సెషన్స్ న్యాయాధికారి ఎన్ లావణ్య శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీర శ్రీనాగవెంకట సత్యనారాయణ, సిహెచ్ నాని, ఎం.చిన్న వెంకయ్య, రామిశెట్టి రవి, వి.ఈశ్వర వరప్రసాద్, ఎన్.భవానీశంకర్, మరి కొంతమంది ఓ కుల సంఘం పేరుతో వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేశారు. సదరు గ్రూపు ఆ కులసంఘానికి నిధులను సమీకరిస్తోంది. ఆ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని చిలకలూరిపేటకు చెందిన తోట నాగవేణు సదరు గ్రూపులో స్పందించాడు. దీంతో ఆగ్రహించిన సదరు గ్రూపులోని సభ్యులు 2021, జనవరి 29 వ తేదీన చిలకలూరిపేటకు వచ్చి ఫిర్యాది నాగవేణు నడుపుతున్న వాటర్ ప్లాంట్‌లోకి అక్రమంగా ప్రవేశించి హత్యాయత్నానికి ఒడి కట్టారు. చుట్టుపక్కల వాళ్ళు రావడంతో నిందితులు అక్కడ నుంచి పారిపోవడంతో నాగవేణు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసు వారు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో హత్యాయత్నానికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా, అక్రమంగా గృహ ప్రవేశానికి మూడేళ్ల జైలు శిక్ష రూ. 5వేలు జరిమానా ఏక కాలంలో అనుభవించేలా తీర్పునిచ్చారు. గత నెల 24వ తేదీన నేరం రుజువైనట్లు న్యాయాధికారి ప్రకటించారు. నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారంటు జారీ చేశారు. పోలీసులు వారి కోసం గాలిస్తుండగా, ముద్దాయిలు స్వచ్ఛందంగా శుక్రవారం కోర్టులో లొంగిపోవడంతో న్యాయాధికారి శిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్‌బాబు నిర్వహించగా అప్పటి ఎస్సై ఎం.మోహన్ కేసు దర్యాప్తు చేశారు.

‘కన్నా’ను విమర్శించే హక్కు అంబటికి లేదు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణను విమ ర్శించే నైతిక హక్కు మాజీ మంత్రి అంబటి రాంబాబుకు లేదని టిడిపి నాయకులు అన్నారు. సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగులను తొలగించారని వైసీపీ చేసిన ఆరోపణలను టిడిపి నాయకులు నాగౌత్ శరయ్య, మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు, యర్ర వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. వైసీపీ హయంలో విద్యుత్‌శాఖలోని షిఫ్ట్ అపరేటర్ ఉద్యోగులను తొలగించారని అన్నారు. రమేష్ అనే ఉద్యోగిని తొలగించి అనేక ఇబ్బందులకు గురిచేసి అతని జీతం డబ్బు లను వైసీపీ నాయకులు కాజేశారని ఆరోపించారు. ఒక్క ఉద్యోగి దగ్గరైనా డబ్బులు తీసుకున్నామని ఆధారాలు చూపించే దమ్ము మీకుందా అని సవాల్ విసిరారు. నోరు జారితే జాగ్రత్త అంటూ అంబటి రాంబాబును హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థినిలు

ఘనంగా క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ .ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో శుక్రవారం క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు తెలిపారు. ముందుగా మేజర్ ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు రోజులుగా వివిధ విభాగాలలో క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మాజీ అథ్లెట్, బ్యాంక్ ఆఫ్ బరోడా అధి కారి తూము లీలమస్తాన్‌రావు, కళాశాల సెక్రటరీ కరస్పాం డెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి నరసింహారావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్,ఎం దాసు, సిహెచ్ అరవింద్, ఎ.సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ అధికారి జి.రమణాకాంతరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం పిఎం కేంద్రీయ విశ్వవిద్యా లయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో జి.రమణ కాంతరెడ్డి, తహశీల్దార్ కెఎస్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రతి కన బరిచిన క్రీడాకారులకు బ్యాడ్జీలను బహూకరించారు. ప్రిన్సిపల్ జగదీష్‌కుమార్ గుప్తా, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాలొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 2025 సంవత్సరంలో విద్యార్థులు సాధించిన క్రీడా విజయాల ఆధా రంగా జిల్లాలో అయిదు పాఠశాలలు ఎంపికయ్యాయి. వాటిల్లో ప్రథమ స్థానాన్ని ఏఎంజి హైస్కూల్ (చిలకలూరిపేట), జిల్లా పరిషత్ హైస్కూల్ (నందిగామ), గుడ్ షెపర్డ్స్ హైస్కూల్ (వినుకొండ), జిల్లా పరిషత్ హైస్కూల్ (పెద మక్కెన), మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ నిలిచాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ఏఎంజి హైస్కూల్ జిల్లాలో ప్రథమ స్థానంతో పాటు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరక్టర్లు ఉదయ్ భాస్కర్, హుస్సేన్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్ కుమార్, పీడీ. చినరామయ్య, ఖాదర్ మస్తాన్, నాగరాజు, అనిల్‌దత్తా, సాంబ శివరావు, అజీమ్, కపిల్, రాజు పాల్గొన్నారు.

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆటలు పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగ మల్లేశ్వర రావు తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ద్యాన్ చంద్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని కళాశాల ఛైర్మన్ మీరావలి తెలిపారు. క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్. కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్ బహుమతులను అందించారు. కళాశాల క్రీడా విభాగాధిపతి హెచ్.గంగాధర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ చైర్మన్ నాతాని వెంకటే శ్వర్లు, ప్రధానోపాధ్యాయులు జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కె. బాపూజీ, వ్యాయామఉపాధ్యాయులు కిషోర్ బాబు, శేషగిరి, పాల్గొన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని, భారత హాకీకి చేసిన అపారమైన సేవలను గుర్తు చేశారు.

చవితి సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వినాయక చవితిని పురస్కరించుకొని సత్తెనపల్లి పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినా యక విగ్రహాలను ఎమ్మెల్యే సందర్శించి అన్నదానం చేశారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పనిచేయని చేతి పంపు.. పట్టించుకోని అధికారులు

నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని గుండాల పాడు అగ్రహారం దాసుల కాలనీలో గవర్నమెంట్ చేతి పంపు రెండు నెలలుగా పనిచేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం చాలా దూరం వెళ్లి నీరు తెచ్చు కోవాల్సి వస్తుందని వారు తెలిపారు. సమస్యపై గ్రామస్థాయి నుండి మండల స్థాయి అధికారులకు పలుమార్లు తెలపగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారి (ఏవో) రవిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయికి, గ్రామపంచాయతీ కార్యదర్శి కోటేశ్వరమ్మ వినతిపత్రం సమర్పించారు. అధికారులు స్పందించి మూడు రోజులలో పంపు రిపేరు చేసి నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

దోమల నిర్మూలనకు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - తెనాలి

దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ కోరారు. స్థానిక గంగానమ్మపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జయ ప్రకాష్ నగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీని జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల పెరుగుదలకు నీటి నిల్వలే కారణంగా చెప్పారు. ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాలలో నీటి నిలువలు లేకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. దోమల నివారణ చర్యలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంచారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ డి సుభాష్ రమాదేవి, సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకరరెడ్డి, ఎస్‌యుఒలు ఎస్.ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, ఎస్.శివగణేష్, సిబ్బంది ఎ. బాలచంద్రమౌళి, జి.రవికుమార్, డి.శ్రీనివాసరావు, డి.శివ నాగమల్లేశ్వర రావు, టి.శివప్రసాద్, షేక్ నవీద్, ఎస్.శరత్ బాబు, ఎం.రత్నాకరరావు, జలరుహాక్షి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రుణాలు పంపిణీ చేస్తున్న సెంట్రల్ బ్యాంక్ అధికారులు

ఖాతాదారులకు రుణాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి దేవస్థానం సెంటర్లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళగిరి బ్రాంచ్‌లో దేశవ్యాప్తంగా జరుగుతున్న మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖాతాదారులకు రుణాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ముంబై సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఏడీ శ్రీనివాస్ హాజరై రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 114 సంవత్సరాలు, మంగళగిరిలో బ్రాంచ్ ప్రారంభించి 14 సంవత్సరాలు అవుతుందన్నారు. బ్రాంచి ప్రారంభించిన 14 సంవత్సరాల్లో మంచి అభివృద్ధి సాధించడం అభినందనీయ మన్నారు. బ్రాంచిలో కోటిన్నర రూపాయల రుణాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఔట్రిచ్ ప్రోగ్రాం ల వలన బ్యాంక్ గురించి ప్రజలకు తెలుస్తుందని కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ పీ సతీష్, డీబీఎన్ గ్రూపు సంస్థల చైర్మన్ దేవతి భావనారాయణ, మంగళగిరి, కొల్లిపర, కుంచనపల్లి బ్రాంచ్ హెడ్‌లు ఐ.ప్రభుకిరణ్, వాసు నాయక్, ఎ.నందగోపాల్, ఎస్‌-ఎల్‌ఎం చైతన్య హైస్కూల్ డైరెక్టర్ శిందే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న వర్షితకు ఎల్‌ఓసి చెక్కును అందజేస్తున్న టిడిపి నాయకులు, అనారోగ్యంతో బాధపడుతున్న వర్షిత, కూతురికి అవయవదానం చేస్తున్న తండ్రి శాంతరాజు

కూతురి ఆయుష్సు కోసం తండ్రి అవయవ దానం

ప్రజాశక్తి - దుగ్గిరాల

అనారోగ్యంతో బాధపడుతున్న కూతురిని బ్రతికించుకునేందుకు తండ్రి తన అవయవాన్ని సైతం ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. స్థానిక దళిత వాడికి చెందిన బెజ్జం వర్షిత గత సంవత్సరం నర నుండి తీవ్ర కాలేయ (లివర్) వ్యాధితో బాధపడుతున్నది. 2024 ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండటంతో పరీక్షలకు హాజరు కాలేదు. దీనితో సప్లమెంటరీ పరీక్ష రాసి ఉత్తీర్ణత పొందినది. ఇటీవల వ్యాధి ముదరటంతో మణిపాల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సిందిగా వైద్యుల సలహా మేరకు అక్కడికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు లివర్ పాడిపోయినదని, రీప్లాంటేషన్ చేయాలని 20 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఆ పేద కుటుంబం సహాయం కోసం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. శుక్రవారం 8లక్షల రూపాయలు మంజూరైనట్లు టిడిపి నాయకులు లెటర్ ఆఫ్ క్రెడిట్ అందజేశారు. ఇంకా 12 లక్షలు కావాల్సి ఉందని తండ్రి బెజ్జం శాంతరాజు తెలిపారు. పెయింటర్ పని చేసుకునే శాంతరాజుకు ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె వర్షిత కాగా రెండో కుమార్తె పదో తరగతి చదువుతోంది. కుమార్తె అనారోగ్యం కారణంగా గత రెండు నెలల నుండి పనికి పోవడం లేదని తండ్రి తెలిపారు. తండ్రి, కూతురికి ఒకేసారి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. తండ్రి కాలేయంలోని భాగాన్ని తీసి కూతురికి అమర్చాల్సి ఉంటుంది. దాతలు ఎవరైనా ముందుకొచ్చి తన కూతురి ప్రాణం కాపాడుకునేందుకు సహాయపడతారే మోనని తండ్రి ఆశిస్తున్నారు.

గృహ హింసను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు

హైకోర్టు న్యాయవాది ఎ.ఎస్.శ్యాంసుందర్‌ను సత్కరిస్తున్న కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై గృహ హింసను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ విభాగం పలు కీలక చర్యలు తీసుకుంటున్నాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది ఎ.ఎస్.శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో కెఎల్ న్యాయ కళాశాల, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ సయుక్త అద్వర్యంలో గృహహింస నుండి మహిళలకు రక్షణ గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయవాది శ్యాంసుందర్ మాట్లాడుతూ శక్తి టీమ్‌లు, మహిళా భద్రత సెల్‌లు, శక్తి మొబైల్ యాప్ వంటి నూతన కార్యక్రమాలు అమలులో ఉన్నాయని తెలిపారు. గత ఏడాది జూన్ నుండి ఇప్పటివరకు 32వేల కంటే ఎక్కువ ప్రాంతాలలో పర్యటనలు, 20 వేల కంటే ఎక్కువ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయని తెలిపారు. గృహ హింసపై ఉన్న ప్రత్యేక న్యాయ వ్యవస్థ, ప్రత్యేక చట్టాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తునామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపం, న్యాయ సహాయం కొరత వంటి అంశాలపై మరింత దీప్తి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా నుండి బాలలను కాపాడాలి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సి.డి.పి.ఓ విజయ లక్ష్మి.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సమాజంలో బాలలను అక్రమ రవాణాదారుల నుండి మరియు బాల్య వివాహాల నుండి కాపాడవలసిన బాధ్యత ప్రతి గ్రామంలోని క్షేత్రస్థాయి కార్యకర్తలైన ఆశ మరియు అంగన్వాడీలపై ఉందని ప్రత్తిపాడు ప్రాజెక్టు శిశు సంక్షేమ శాఖ బాలల అభివృద్ధి, రక్షణ అధికారి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వట్టిచెరుకూరు సెక్టార్ పరిధిలోని కొర్నెపాడు అంగన్వాడీ కేంద్రంలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యకర్తలకు "సురక్షిత గ్రామ జ్యోతి" పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. సి.డి.పి.ఓ మాట్లాడుతూ గ్రామాలలో జరిగే సమస్యలు బాల్యవివాహాలు, గృహహింస, మానవ అక్రమ రవాణా లాంటి సమస్యలను నిరోధించేందుకు సురక్షిత గ్రామాల కోసం పనిచేస్తున్న వారికి ఒకరోజు శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్, శిశు సంక్షేమ శాఖ ఎ.సి.డి.పి.ఓ విజయనిర్మల, కొర్నెపాడు మహిళా సంరక్షణ కార్యదర్శి ధరణి, ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కె. వెంకటేశ్వరరావు, శిక్షకుడు బాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ ఉషారాణి, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, ల్యాంప్ సంస్థ ప్రతినిధి తురకా మంగయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు మేరిమ్మ, ఇందిర, రాజకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మహిళకు పెన్షన్ మంజూరు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

భర్త చనిపోవడంతో ఏ ప్రభుత్వ పథకానికి, కనీసం భర్త చనిపోయిన తాను బతికేందుకు, ఆ దరువుగా విడో పెన్షన్‌కు కూడా నోచుకోని దయనీయ పరిస్థితిలో ఇబ్బందులు పడిన ఆ మహిళకు ఎట్టకేలకు పెన్షన్ మంజూరైంది. దీంతో కలెక్టర్‌కు, అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. మెల్లెంపూడి గ్రామానికి చెందిన బి.అశోక్ రెడ్డి మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన వెంకట దుర్గా సమీరాతో 2019లో ప్రేమ వివాహం అయ్యింది. 2021లో భర్త అశోక్ రెడ్డి చనిపోయాడు. ఇద్దరు బిడ్డలను పెంచుకుంటూ జీవిస్తోంది. ఆన్‌లైన్‌లో కారు ఉందని చూపడంతో ఏ ప్రభుత్వ పథకానికి అర్హురాలు కాదంటూ అధికారులు తేల్చి చెబుతున్నారు. తనకు పింఛన్ ఇప్పించాలంటూ, తన బిడ్డకు అమ్మఒడి పథకం వర్తించడం లేదంటూ, సమస్యను పరిష్కరించమని ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉంది. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ దృష్టికి గ్రీవెన్స్ రూపంలో సమస్యను విన్నవించుకోగా, స్పందించిన కలెక్టర్ సంబంధిత ఆర్టిఓ అధికారిని పిలిచి, మహిళ సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గంటల వ్యవధిలోనే అధికారులు సమస్యను పరిష్కరించే దిశగా పనిచేసి, వెంకట దుర్గ సమీరా భర్త పేరుతో ఉన్న కారు రిజిస్ట్రేషన్ ను రద్దు చేసి, క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడంతో, ఏళ్ల తరబడి సమస్య పరిష్కారం కానీ తన సమస్య పరిష్కారం అవడంతో గుంటూరు జిల్లా కలెక్టర్‌కు, ఆర్టిఓ అధికారికి మహిళ ధన్యవాదాలు తెలిపింది.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

269వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మి కులు కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 269వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఎం.గురవయ్య బి.అంకయ్య, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షలలో దేరంగుల రమణమ్మ, వేము రిబ్కా, దామవరపు సువర్ణకుమారి, మొలక శారద, ఉప్పు కాసమ్మ కూర్చున్నారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పి.హనుమంతరావు, ఆరిఫ్, ఇస్మాయిల్, ఆశీర్వాదం, యహెూషువ, సుభాని, మరియు మహిళలు పాల్గొన్నారు.

ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, యాజమాన్యం

నెహ్రూ నికేతన్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్‌లోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. తొలుత ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతా కాంత్ దాసరి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మేజర్ ధ్యాన్ చంద్ 1928, 1932, 1936 ఒలంపిక్స్‌లో బంగారు పతకాలను సాధించడంలో కీలకంగా ఉన్నాడని, ఆ కారణంగానే ఆయనను హాకీ విజార్డ్ అని పిలుస్తారని చెప్పారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, విద్య, ఉపాధి అవకాశాలలోనూ క్రీడాకారులకు ప్రాధాన్యత ఉందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హరికృష్ణ వర్ధంతి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్టీఆర్ తనయుడు, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతిని శుక్రవారం టీడీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెస్సెస్ ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హరికఅష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, మండల పార్టీ అధ్యక్షులు పళ్ళబోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గాదె పిచ్చిరెడ్డి, గుత్తికొండ ధనుంజయరావు, అబ్దుల్ మజీద్, కొదమల సైమన్, భైరబోయిన శ్రీనివాసరావు, మాజేటి గోపాలకృష్ణ శ్రేష్టి, ఎండీ ఇబ్రహీం, మన్యం రమేష్, జంజనం సుబ్బారావు, వాకా మాధవరావు, పేరం ఏడుకొండలు, షేక్ సుభాని, షేక్ హుస్సేన్, వింజమూరి చంద్రశేఖర్, జొన్నాదుల బాలకృష్ణ, ఆలేటి బాలకృష్ణ, యలమంచిలి పద్మజ, వెలగపాటి విలియం, గోసాల రాఘవ, యుద్ధం అప్పారావు, కౌతరపు శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, చెన్నారావు, మస్తాన్ ఖాన్ పాల్గొన్నారు.

రేపటి నుండి నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 31న ఉదయం సరఫరా తర్వాత నెహ్రూనగర్ రిజర్వాయర్ నుండి హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్ త్రాగునీటి సరఫరా జరిగే 900 ఎంఎం డయా పైప్‌లైన్‌కు నెహ్రూనగర్ పంప్‌హౌస్, సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ చేయాడానికి జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేశారన్నారు. పైప్‌లైన్ ఇంటర్‌కనెక్షన్ పనులకోసం తక్కెళ్లపాడు హెడ్‌వాటర్ వర్క్స్ లోని ఫిల్టరేషన్ పాయింట్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనివలన 31వ తేదీ సాయంత్రం నుండి సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతుందని, 2వ తేదీ సాయంత్రం పాక్షికంగా 3వ తేదీ ఉదయం నుండి యధావిదిగా సరఫరా జరుగుతుందని తెలిపారు. పనుల వలన నగరంలోని హెచ్ఎల్ఆర్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, ఏఎంసి, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కోర్ట్ కాంపౌండ్, కెవిపి కాలనీ, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాలబీడు, వసంతరాయపురం, శారదా కాలనీ, రెడ్డిపాలెం, గోరంట్ల, నగరాలూ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి అంతరాయం కల్గుతుందన్నారు. కావున ప్రజలు సహకరించి, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

కళ్లం కాలేజి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

వెంకటేశ్వర్లును అభినందిస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్

కళ్ళం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజిలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగం అధ్యాపకులు తాతా వెంకటేశ్వర్లు అన్నామలై విశ్వవిద్యాలయం నుండి పిఎచ్‌డి పట్టా పొందారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర రెడ్డి తెలిపారు. కార్డియో వాస్క్యూలర్ డిసీజ్ ప్రిడిక్షన్- ఇంటిగ్రేటెడ్ క్రిటికల్ డేటా అండ్ మెషిన్ లెర్నింగ్ అప్రోచెస్ అనే అంశంపై పరిశోధన చేశాడని, అన్నామలై యూనివర్సిటీ హెచ్ఒడి డాక్టర్ ఆర్.భవానీ సంచాలకులుగానూ, ఎన్ఇసి కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస శర్మ సహ సంచాలకులుగా వ్యవహరించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.జె.సన్నీడియోల్, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎల్.మాధవరావు డాక్టర్ తాతా వెంకటేశ్వరరావును అభినందించారు.

చిప్స్ కాలేజీలో ఘనంగా చిప్సోరియం పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న ప్రొఫెసర్ సింహాచలం

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో చిప్సోరియం పేరుతో క్యారమ్స్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 25 ఫార్మసీ కాలేజిల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, పాటలు, ఏకపాత్రాభినయం, అంత్యాక్షరి, డంబ్‌చరేడ్స్ వంటి సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుమీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. హిందూ ఫార్మసీ కాలేజికి ప్రధమ బహుమతి కింద రూ.10వేలు, విజ్ఞాన్ ఫార్మసీ కాలేజికి ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందచేశారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, కృష్ణ యూనివర్సిటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి.భసవేశ్వరరావు పాల్గొని విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలవైపు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ నాగలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సాంకేతిక ఆవిష్కరణలలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సి.ఐ.ఐ విజయవాడ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.నాగలక్ష్మి, వైస్ చైర్మన్ అభినవ్ కోటగిరి అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 'ది ఎవాల్వింగ్ ల్యాండ్‌స్కేప్ అఫ్ ఇండియన్ ఇన్నోవేషన్ ఇన్ ఫార్మాస్యూటికల్, టెక్-పవర్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ : స్కేలింగ్ స్టార్టప్ విత్ డేటా అండ్ డైవర్సిటీ' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. ఔషధ రంగంలో జరుగుతున్న తాజా పరిశోధనలను, నూతన స్టార్టప్‌ల స్థాపనలో డేటా అనలిటిక్స్, టెక్నాలజీ, వైవిధ్యమైన ఆలోచనల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.భారత దేశ పరిశోధనా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వ రంగాలు, ప్రైవేట్ సంస్థల సంయుక్త సహకారంతో పాటూ విద్యార్థుల భగస్వామ్యం అవసరమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కన్నా విద్యాసంస్థలలో

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతగుంటూరు, బొడ్డురాయి వీధిలోని కన్నా పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాతృభాష ప్రాధాన్యతపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగుభాష కళామతల్లిని కీర్తిస్తూ విద్యార్థినిలు ప్రదర్శించిన నత్యరూపకం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.చంద్రశేఖర్, కన్న విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కన్న మాస్టార్ పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతున్న నాయుడు చక్రనాగ్

ప్రజ్ఞ విద్యాసంస్థలలో

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థి దశలోనే మాతృభాషను అభ్యసించడం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ప్రోత్సహించటం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని అందిపుచ్చుకుంటారని విద్యా భారతి విద్వత్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బైరిశెట్టి మల్లికార్జునరావు అన్నారు. ప్రజ్ఞ విద్యాసంస్థలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత వ్యవహారికభాష పితామహులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మేక్ మై బేబీ జీనియస్ సంస్థ వ్యవస్థాపకులు భాస్కర్ రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్, హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్, ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు ప్రసంగించారు.

సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజీలో

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో ప్రాచ్యభాషా విభాగం వారు తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సంధ్య టి అధ్యక్షత వహించారు. బ్రహ్మశ్రీ బిరుదాంకితులు డాక్టర్ భావన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఆర్.షారూన్‌రోజ్, తెలుగు అధ్యాపకులు ఆర్.ఫణిరాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థినులకు ఈ సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి జి.బాలశౌరెడ్డి, ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్ కె.సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజీలో

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కాలేజి, ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవహారిక భాష ఉద్యమ నాయకులు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ అమలమేరి, జోసిఫిన్, ప్రిన్సిపాల్ విమలమేరి, సిస్టర్ జాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

సుమేధా హైస్కూల్లో

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణ, సాంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లలితకుమారి తదితరులు

తెలుగు భాషా వికాసంలో యువత పాత్ర కీలకం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో శుక్రవారం గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవితా రచయిత్రి డాక్టర్ మైలవరపు లలితకుమారి ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. పొరుగు దేశాల కవులు మెచ్చుకున్న చక్కని భాష మన తెలుగని, అందలం ఎక్కిన భాషను సామాన్యునికి చేరవేసిన వ్యక్తి, వ్యవహారిక భాషా ఉద్యమరూపశిల్పి గిడుగు వెంకట రామ్మూర్తి అని చెప్పారు. తెలుగు భాషలో వున్న నుడికారాలు, మమకారాలు మరే భాషలో లేవన్నారు. నేటి సాంకేతికత సహాయంతో భాషను అభివద్ధి చేసే బాధ్యత యువత ఉందన్నారు. విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్.కామేశ్వరశాస్త్రి, వైస్‌ప్రిన్సిపాల్ ఏ భానుమురళి, తెలుగు శాఖాదిపతి డాక్టర్ జె.వి.సుధీర్.కుమార్, ఇంటర్ కళాశాల ఇంచార్జ్ జి సురేష్ కుమార్, బోటనీ అధ్యాపకులు శ్రీమతి చంద్రిక గారు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కెఎల్‌పి స్కూల్లో ఘనంగా క్రీడా వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో శుక్రవారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని పాఠశాల 42వ క్రీడా వేడుకలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిషియన్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్రీడాకేతనాన్ని, బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. డాక్టర్ కృష్ణప్రసాద్ క్రీడాజ్యోతి వెలిగించి, దానిని విద్యార్థులకు అందించి, క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని చెప్పారు. నాయకత్వ లక్షణాలను పెంపొదిస్తాయని, ఓటమి కూడా గెలుపునకు ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జుంబానృత్యం, పిరమిడ్ విన్యాసాలు, కర్రసాము, లెజిమ్స్ మొదలైన కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఏఒ కె.వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పాఠశాల సెక్రెటరీ పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఆర్‌బి అవార్డుకు కాళహస్తి రాజశేఖర్ ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకు చెందిన కాళహస్తి రాజశేఖర్ అమెరికాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆర్బి -2025 అవార్డు దక్కించుకున్నారు. బృందావన్ గార్డెన్స్ లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రిటైర్డుపోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణతో కలిసి రాజశేఖర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అమెరికాలో బల్విన్ట్ గ్రూపు చీఫ్ డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా కాళహస్తి రాజశేఖర్ పనిచేస్తున్నారు. అమెరికాలో ఎంతో ప్రతిభ పాఠవాలను ప్రదర్శించిన టెక్నాలజీ లీడర్ల కు ఈ అవార్డు లభిస్తోంది. బల్విన్ గ్రూపు 1.4 బిలియన్ డాలర్ల సంస్థగా ఎదగడంలో రాజశేఖర్ కాళహస్తి కృషి చేశారు. టెక్నాలజీ పరంగా ఆయన తీసుకువచ్చిన మార్పులు కంపెనీ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడ్డాయి. బిట్స్-పిలానీ, ట్రిపుల్ ఐటీ-బెంగళూరులో ఉన్నత విద్య అభ్యసించి టెక్నాలజీ రంగంలో నైపుణ్యత సంపాదించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆర్థిక, బీమా సేవల్లో.. క్రెడిబిలిటీ , వేగం, ఇన్నోవేషన్ ఎంతో ముఖ్యమన్నారు. రానున్న రోజుల్లో ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను విస్తతంగా వినియోగించాల్సి వస్తుందని తద్వారా కొంత నష్టం ఉన్నప్పటికీ అదే సమయంలో లాభాలు కూడా ఉన్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో నూతన రాజధాని అమరావతిలో కూడా టెక్నాలజీ సేవల ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న రాజశేఖర్ ను పలువురు సత్కరించారు.రిటైర్డు డిఎస్పి సుబ్బారెడ్డి, ఎస్ ఐ ఎస్ ఎస్, ప్రముఖ పారిశ్రామికవేత్త నన్నపనేని సుబ్బయ్య, చిగురుపాటి నాని పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఇన్నోవేషన్ వేదికపై మలినేని విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కలేజి ఇసిఇ విభాగం విద్యార్థులు దేవిరెడ్డి నాగజ్యోతి, దావులూరి హరికాచౌదరి, అళ్ళు శివ పార్వతి మలేసియాలోని యుకెఎం యూనివర్సిటీలో జరిగిన ఇన్నోవేషన్ చాలెంజ్ ట్రాక్ డైరెక్ట్ ఎంట్రీలో పాల్గొని సృజనాత్మక ఆవిష్కరణను విజయవంతంగా ప్రదర్శించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులు రెండవ సంవత్సరం నుంచే హ్యాకథాన్‌లు, ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌లలో చురుకుగా పాల్గొనటం వల్ల, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ డి.విజయసారధి అభినందించారు.

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్